బీసీల రాజ్యాధికారానికి మరో ఉద్యమం

- తెలంగాణ ఉద్యమ తరహాలో పోరాడుతాం
- 10న ధర్నాచౌక్‌లో బీసీల సత్యాగ్రహదీక్ష
- బీసీలు భారీగా తరలిరావాలి
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

బీసీల సత్యాగ్రహ దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, రాజారాంయాదవ్

ఖైరతాబాద్, ఆగస్టు 3: బీసీల రాజ్యాధికారం కోసం తెలంగాణ తరహాలో మరో ఉద్యమానికి సిద్ధమవ్వాలని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఇందిపార్కు ధర్నాచౌక్ వద్ద ఈ నెల 10న నిర్వహించే 'బీసీల సత్యాగ్రహదీక్ష' పోస్టర్లను బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాంయాదవ్, హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్లు, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు పిడికిలి రాజు, ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్, టీ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడి సమగ్ర కులగణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. మోసం చేయాలని కాంగ్రెస్‌పార్టీ ప్రయత్నిస్తే బీసీ సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ నెల 10న బీసీల సత్యాగ్రహ దీక్షకు కులాలు, సంఘాలు, పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమ తరహాలో మరోసారి తెగించి పోరాడి, కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచైనా బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయిస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీలోని బీసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలే బహిరంగంగా కాంగ్రెస్ వైఖరిని ఎండగడుతున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో బీసీ విప్లవం రాబోతున్నదని, ప్రభుత్వం దిగిరాక తప్పదన్నారు. రాజారాం యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. దేశంలో రాహుల్ గాంధీ ఓ మాట, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి మరో విధంగా వ్యవహరిస్తున్నారని, ఈ ద్వంద వైఖరిని జాతీయ స్థాయిలో ఎండగడుతామని చెప్పారు. సత్యాగ్రహదీక్షకు బీసీలు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు ఎల్. గోవర్ధన్, యాదాద్రి భువనగిరి జిల్లా శ్రీ కృష్ణ యాదవ, నవ సంఘర్షణ సమితి నాయకులు శ్రవణ్ గౌడ్, లింగస్వామి గౌడ్, విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొంపెల్లి రాజు, ఓయూ విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు అశోక్ యాదవ్, జక్కుల మధు యాదవ్, హిందూ బీసీ ఆజాదీ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు దేశం మహేశ్ గౌడ్, అంబేద్కర్ ఆజాదీ సంఘ్ నాయకుడు కొంగర నరహరి, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలంపల్లి రామకోటి ముదిరాజ్, తెలంగాణ బీసీ విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోట్ల వాసుదేవ్, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ జాతీయ అధ్యక్షుడు కిరణ్ పాల్గొన్నారు.

రిజర్వేషన్లు పెంచాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య

చిక్కడపల్లి, ఆగస్టు 3: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కులగణన చేసి బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మంత్రులను, ప్రజాప్రతినిధులను తిరగనివ్వమని స్పష్టంచేశారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కులగణన, 42 శాతం రిజర్వేషన్ల పెంపు, షెడ్యూల్(9)లో చేర్పించడానికి అవసరమైన కార్యాచరణకు రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అధ్యక్షతన శనివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో నిరసన దీక్ష చేపట్టారు. ఆర్ కృష్ణయ్య, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవి, సమాజ్‌వాది రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ సింహాద్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు 42 శాతం బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేంద్రం తక్షణం బిల్లు పెట్టాలని, లేకుంటే తామే ప్రైవేట్ బిల్లు పెట్టిస్తే ఈ ప్రభుత్వాలకు ఉనికి ఉంటుందా? అని ప్రశ్నించారు. సమావేశంలో బీసీ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, గుజ్జ సత్యం, కోలా జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

జలాశయాలు నింపి రైతులకు నీరివ్వండి

మంత్రి ఉత్తమ్‌కు హరీశ్‌రావు లేఖ

హైదరాబాద్, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ) / సిద్దిపేటప్రతినిధి: సిద్దిపేట జిల్లాలోని అన్నపూర్ణ(అనంతగిరి) రిజర్వాయర్, రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ జలాశయాల్లోని కాళేశ్వరం గోదావరి జలాలు పంపింగ్ చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు లేఖ రాశారు. ప్రస్తుతం ఈ రిజర్వాయర్లు డెడ్‌స్టోరేజీకి చేరినట్టు తెలిపారు. గతేడాది ఇదే ఆగస్టు నెలలో అనంతగిరి రిజర్వాయర్‌లో 3.32 టీఎంసీలు నీళ్లు ఉంటే, ప్రస్తుతం 0.75 టీఎంసీలు, రంగనాయకసాగర్‌లో 2.38 టీఎంసీలకు ప్రస్తుతం 0.67 టీఎంసీలు, మల్లన్నసాగర్ 18 టీఎంసీలకు ప్రస్తుతం 8.5 టీఎంసీలు, కొండపోచమ్మ సాగర్‌లో 10 టీఎంసీలకు ప్రస్తుతం 4.5 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నట్టు లేఖలో పేర్కొన్నారు. ఒకవైపు రిజర్వాయర్లలో నీళ్లు లేక, మరోవైపు వర్షాలు కురవక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, పంటలు వేయాలా? వద్దా?అనే అయోమయంతో ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. గతేడాదితో పోలిస్తే జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం తగ్గిపోయిందని చెప్పారు. రాజకీయాలు పక్కనపెట్టి మిడ్ మానేరు అన్నపూర్ణ రిజర్వాయర్, రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లకు నీటిని పంపింగ్ చేసేలా ఇరిగేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేయాలని కోరారు. రిజర్వాయర్లు నింపి కాలువల ద్వారా నీటిని విడుదల చేసి ఆయకట్టుకు నీళ్లందించేలా చర్యలు తీసుకోవాలని రైతుల పక్షాన మంత్రిని హరీశ్‌రావు లేఖలో కోరారు.

తెలంగాణ అధ్యయనాల కేంద్రం ఏర్పాటు చేయండి

కేంద్రానికి మాజీ ఎంపీ వినోద్ కుమార్ లేఖ

హైదరాబాద్, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో తెలంగాణ అధ్యయనాల కేంద్రం, మల్టీడిసిప్లినరీ రిసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన శనివారం కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, జీ కిషన్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ కేంద్రం తెలంగాణ ప్రాంతంలోని సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, భాషాపరమైన అంశాలను లోతుగా పరిశోధిస్తూ, సమగ్ర అవగాహనను పెంపొందిస్తూ.. ఈ డొమైన్‌లలో అకడమిక్ ఎక్సలెన్స్‌ను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంటుందని తెలిపారు. ఈ కేంద్రం రాష్ట్రంపై దృష్టి సారించి లోతైన పరిశోధనలు చేసి, మేధావుల కార్యకలాపాలకు కేంద్రంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కేంద్రం ఏర్పాటుతో బహుళ అంశాల పరిశోధన సులభతరం అవుతుందని అభిప్రాయపడ్డారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన యువత ఆకాంక్షలను నెరవేర్చడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. వారికి అధునాతన పరిశోధన, ఇతర అవకాశాలను అందించడానికి ఈ కేంద్రం దోహదపడుతుందని పేర్కొన్నారు. స్థానిక సంస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడంలో కూడా కృషి చేస్తుందని తెలిపారు. అధ్యయనం, పరిశోధనల కేంద్రం ఏర్పాటుతో హైదరాబాద్ యూనివర్సిటీ కూడా విద్యాపరంగా అభివృద్ధి చెందడమే కాకుండా రాష్ట్రానికి సంబంధించిన విధాన రూపకల్పన, అభివృద్ధి వ్యూహాలను రూపొందించడంలో విలువైన సమాచారాన్ని, డాటానుకూడా అందించగలదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంత ప్రత్యేక లక్షణాలు, సవాళ్లపై లోతైన అవగాహనను పెంపొందించడం ద్వారా, సామాజిక-ఆర్థిక వృద్ధికి, సాంస్కృతి పరిరక్షణకు ఇతోధికంగా ఈ కేంద్రం దోహదపడగలదని అభిప్రాయపడ్డారు. ఇటువంటి కేంద్రాలను మిజోరం, రాజస్థాన్, తమిళనాడు రాష్ట్రాలు కలిగి ఉన్నాయని తెలిపారు. తెలంగాణ ఏర్పాటు సమయంలో ఊహించిన విధంగా సమ్మిళిత, సమానమైన అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ఉన్న ఈ దృక్పథాన్ని సాకారం చేయడంలో సహాయం చేయాలని ఆయన కేంద్ర మంత్రులను కోరారు.

నడవ చేతకాదు.. ఉరికిస్తవా?

- ఎక్కడికి రావాలో ప్లేస్ చెప్పు
- నీకు భయపడేటోడు ఎవ్వడూ లేడు
- హైదరాబాద్‌ల తిరగనియ్య అన్నవ్
- నేను నగరం నడిబొడ్డున ఉన్న.. రా!
- దానంకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సవాల్



హైదరాబాద్, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ) : 'నువ్వు భయపెడితే భయపడేటోడు ఎవ్వడూ లేడు.. నేను హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న. దమ్ముంటే, ఎక్కడికి రావాలో ప్లేస్ చెప్పు.. నీ ఖైరతాబాద్ చౌరస్తాకు రావాల్నా? అశోక్‌నగర్ చౌరస్తాకు రావాలా? నువ్వు డేట్, టైం, ప్లేస్ చెప్పు.. వచ్చేందుకు నేను సిద్ధం' అంటూ దానం నాగేందర్‌కు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సవాల్ విసిరారు. శనివారం ఆయన అసెంబ్లీ మీడియా హాల్‌లో మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. 'గతంలో అందరం కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు ఇలాంటి పిచ్చికూతలు కూస్తే బండారు లక్ష్మారెడ్డి, ఎల్బీనగర్ సుధీర్ రెడ్డి కలిసి ఉరికించింది మరిచిపోయినవా?' అంటూ ప్రశ్నించారు. 'అలా మళ్లోసారి కావాల్నా?' అంటూ హెచ్చరించారు. 'నీకు నడవ చాతకాదు, నన్ను ఉరికిస్తవా?' అంటూ ఎద్దేవాచేశారు. నోరు దగ్గర పెట్టుకొని మాట్లాడాలంటూ హెచ్చరించారు. 'దానం నాగేందర్.. నువ్వు టీషర్ట్‌లు వేసుకొని పౌడర్ కొట్టుకొని తాజ్ కృష్ణ ఇండోర్ స్టేడియంలో అడే ఆటలన్నీ నాకు తెలుసు' అంటూ ధ్వజమెత్తారు. 'ఇక్కడ ఉన్నది కేసీఆర్ శిష్యులం.. భయపెట్టిస్తే భయపడేటోళ్లం కాదు' అంటూ తెగేసిచెప్పారు. దానంకు నైతిక విలువలు ఉంటే కేసీఆర్ పెట్టిన భిక్ష అయిన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. స్పీకర్ సమక్షంలోనే, నిండు సభలో శాసనసభ్యులనే తిరగనివ్వం, చంపేస్తామంటున్నాడంటే ఇక ప్రజల పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తంచేశారు.

ఒక్క ఉద్యోగం ఎక్కువ ఇచ్చినా రాజీనామా

కేసీఆర్ హయాంలో 2.32 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారని, బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇక్కడికి కంటే ఒక్క ఉద్యోగం ఎక్కువ ఇచ్చినా తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కౌశిక్‌రెడ్డి సవాల్ చేశారు. ఈ సవాల్‌ను గతంలో అనేకసార్లు చేసినా ఇంతవరకు బీజేపీ, కాంగ్రెస్ నేతలు స్పందించలేదని ఎద్దేవాచేశారు. రాష్ట్రంలోని ప్రైవేట్ రంగంలో పది లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించారని, ఆ రెండు పార్టీల పాలిత రాష్ట్రాల్లో అంతకు ఒక్క ఉద్యోగం ఎక్కువ ఇచ్చినట్టు నిరూపిస్తే తాను దేనికైనా సిద్ధమని స్పష్టంచేశారు. కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేషన్లతో సంబంధం లేకుండా కాంగ్రెస్ ఇస్తామన్న రెండు లక్షల కొత్త ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇంతవరకు ఒక్క ఉద్యోగాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం భర్తీ చేయలేదని చెప్పారు. కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేషన్లతో భర్తీ అయిన ఉద్యోగాలను సీఎం రేవంత్‌రెడ్డి సిగ్గుశరం లేకుండా తాము ఇచ్చామని చెప్పుకొంటున్నారని ధ్వజమెత్తారు.

అమ్మను తిట్టడం సంస్కారమా?

ఎన్నికలప్పుడు జాబ్ క్యాలెండర్‌పై రేవంత్, భట్టి సంతకాలతో భారీ పత్రికా ప్రకటనలు ఇచ్చారని, వేయికండ్లతో ఎదురుచూసిన నిరుద్యోగులను నిన్న ఉత్త కాగితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ నిరాశపరిచిందని కౌశిక్‌రెడ్డి విమర్శించారు. తాము సభలో నిరుద్యోగుల సమస్యలపై మాట్లాడుతుంటే సీఎం రేవంత్ దానం నాగేందర్‌ను రెచ్చగొట్టి బూతులు తిట్టించారని మండిపడ్డారు. 'నీయమ్మ అని అమ్మను తిట్టడం సంస్కారమా? అని అడుగుతున్నా' అంటూ కౌశిక్‌రెడ్డి నిలదీశారు. నిబంధనల ప్రకారం సభలో సభ్యుడికి కేటాయించిన సీటునుంచే మాట్లాడాలని, అందుకు విరుద్ధంగా దానం మరో సీటు నుంచి మాట్లాడారని చెప్పారు.

ఈ నెలాఖరులో డీఎస్సీ ఫలితాలు

హైదరాబాద్, ఆగస్టు 3(నమస్తే తెలంగాణ): డీఎస్సీ పరీక్షలు సోమవారంతో ముగియనున్నాయి. నెలాఖరులో ఫలితాలు విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు. ప్రాథమిక కీని విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరిస్తారు. అనంతరం ఫైనల్ కీని ఖరారుచేస్తారు. ఆ తర్వాత జనరల్ ర్యాంకింగ్ లిస్టు విడుదల చేస్తారు. ఒక్కో పోస్టుకు ఇద్దరు చొప్పున అభ్యర్థులను సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు పిలిచి నియామక ఉత్తర్వులను అందజేస్తారు.

1:3 చొప్పున వెరిఫికేషన్ చేపట్టాలి

సర్టిఫికెట్ వెరిఫికేషన్ 1:3 చొప్పున చేపట్టాలని డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల అసోసియేషన్ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి శనివారం ఎస్ఈ డైరెక్టర్ నర్సింహారెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. టీఆర్టీ ఇదే విధానంలో వెరిఫికేషన్ నిర్వహించారని, గురుకుల బోర్డు ఇందుకు విరుద్ధంగా 1:2 చొప్పున జాబితా ఇచ్చారని గుర్తుచేశారు.

బీఆర్ఎస్ కార్యాలయాన్ని కూల్చేయండి

- లేదంటే కమిషనర్‌పై కేసు పెట్టి జైలుకు పంపండి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మరోసారి అక్కసు

నల్లగొండ, ఆగస్టు 3: నల్లగొండ పట్టణంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాన్ని కూల్చేయండని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మరోమారు అక్కసును వెళ్లగక్కారు. గతంలో ఒకసారి అధికారులను ఇలాగే ఆదేశించగా.. శనివారం నల్లగొండలో కౌన్సిల్ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా మరోమారు బీఆర్ఎస్‌పై విరుచుకుపడ్డారు. మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్‌ను పిలిచి బీఆర్ఎస్ ఆఫీసు కూల్చివేత ఎంతవరకు వచ్చిందని ఆరాతీశారు. ఆయన మౌనంగా ఉండటంతో 'నువ్వు కూల్చేస్తావా.. లేదా? బీఆరెసోళ్లు చెప్పినట్టు చేస్తున్నావా!' అంటూ మండిపడ్డారు. 'నేను అమెరికా వెళ్తున్నా. ఈ నెల 11న తిరిగి వస్తా. ఆలోపు ఆ ఆఫీస్ నేలమట్టం చేయాలి' అని ఆదేశించారు. పక్కనే ఉన్న అదనపు కలెక్టర్ పూర్ణచందర్‌ను పిలిచి.. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర కుమార్‌కు ఆదివారం నోటీసులు జారీ చేసి.. సోమవారం ఆఫీసు రేకులు ఎక్కడ పెట్టాలో అడగాలని సూచించారు. ఇది మంత్రి ఆర్డర్ అంటూ హుకుం జారీ చేశారు. బీఆర్ఎస్ ఆఫీస్ స్థానంలో 20 లక్షల కిలోలీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ప్లాన్ తయారు చేయాలని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.అసెంబ్లీలో తీర్మానం చేసి స్వాధీనం చేసుకుంటామని కోమటిరెడ్డి పేర్కొన్నారు. వాటర్ ట్యాంక్‌తో పాటు వెనుక భాగంలో స్త్రీనిధి భవనం నిర్మించాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ స్పందించడం లేదని గ్రహించిన మంత్రి కోమటిరెడ్డి.. వెంటనే పక్కనే ఉన్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డిని పిలిచి ఆదివారం బీఆర్ఎస్ అధ్యక్షుడికి కమిషనర్ ద్వారా నోటీస్ పంపే బాధ్యత తీసుకుని, ఆ వెంటనే నిర్మాణం కూల్చేయాలని సూచించారు. కమిషనర్ స్పందించకపోతే ఆయనపై కేసు పెట్టి జైలుకు పంపండని అసహనం వ్యక్తంచేశారు. ఒక దశలో చైర్మన్ కూడా పెద్దగా రెస్పాండ్ కాకపోవడంతో 'నేనేం చెప్తున్నాను.. నువ్వేం వింటున్నావ్' అంటూ మంత్రి ఒకింత విసుక్కున్నారు.

వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను

నల్లగొండ రూరల్, ఆగస్టు 3 : 'వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను.. ఆరోగ్యం కూడా సహకరించకపోవచ్చు. రాజకీయాల్లో ఉన్నా, లేకున్నా ప్రజలకు సేవ చేస్తూనే ఉంటా'నని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా గుండ్లపల్లిలో డీ-37 కెనాల్‌కు శనివారం నీటిని విడుదల చేశారు. అనంతరం గ్రామానికి చెందిన రాజేంద్రప్రసాద్ వ్యవసాయ క్షేత్రంలో కాసేపు విరామం తీసుకొని భోజనం చేశారు. ఆ తరువాత ముఖ్య అనుచరులు, సన్నిహితులతో కాసేపు ముచ్చటిస్తూ పైవిధంగా చెప్పుకొచ్చారు. శ్రీశైలం సొరంగం, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు పూర్తి చేయడం తన చిరకాల ఆకాంక్ష అని పేర్కొన్నట్టు తెలిసింది.

సైబర్ వల.. బాధితుల విలవిల

- పటాన్‌చెరులో రూ.2.43 కోట్లు పోగొట్టుకున్న ప్రైవేట్ ఉద్యోగి
- మెట్‌పల్లిలో రూ.72 లక్షలు మోసపోయిన పిల్లల వైద్యుడు
- మంచిర్యాల జిల్లాలో 'రియల్' వ్యాపారి సొమ్ము రూ.99 వేలు

పటాన్‌చెరు/మెట్‌పల్లి/సీసీసీ నస్పూర్, ఆగస్టు 3:తక్కువ పెట్టుబడి..ఎక్కువలాభాలు అని కేటుగాళ్లు పంపిన మెసేజ్‌లకు ముగ్గురు స్పందించారు. వారి ఆఫర్లకు చిక్కి రూ.3.16 కోట్లు పోగొట్టుకుని పోలీసులను ఆశ్రయించారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని ఏపీఆర్ హోమ్స్‌లో ఉంటున్న ప్రైవేటు ఉద్యోగి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుని రూ.2.43 కోట్లు పోగొట్టుకున్నాడు. జూన్ నెలలో ఫేస్‌బుక్‌లో వచ్చిన ప్రకటనకు ఆకర్షితుడై 22 విడుతల్లో రూ.2.43 కోట్లు పెట్టుబడి పెట్టాడు. పెట్టుబడి లాభాలతో కలిసి రూ.6 కోట్లకు చేరినట్టుగా అకౌంట్లో చూపింది. నగదును విత్‌డ్రా చేసుకోవాలని శుక్రవారం ప్రయత్నం చేస్తే డబ్బులు కనిపించలేదు. దీంతో మోసపోయానని పోలీసులను ఆశ్రయించాడు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఓ పిల్లల వైద్యుడికి స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడం అలవాటు. మే 18న ఇన్‌స్టాగ్రామ్‌లోకి వెళ్లి ఆక్సెల్ స్టూడెంట్ సీ 95 గ్రూప్‌లో లింక్ ఓపెన్ చేసి అదే నెల 22 నుంచి విడుతల వారీగా మొత్తం రూ.22 లక్షలు పెట్టుబడి పెట్టాడు. తర్వాత రూ.50 లక్షలు కట్టాలని, లేదంటే క్రెడిట్ స్కోర్ పడిపోతుందని చెప్పడంతో తన వద్ద ఉన్న కొంత, మరికొంత అప్పు చేసి రూ.50 లక్షలు కట్టాడు. జూన్ 26న ఐపీవోలో పెట్టిన పెట్టుబడి లాభం రూ.1.27 కోట్లకు పెరిగిందని, మళ్లీ ఇంకో ఐపీవో సబ్‌స్క్రైబ్ చేసుకోవాలని వాట్సాప్ కాల్ వచ్చింది. ఇక తన వద్ద డబ్బు లేదని, తన డబ్బులు విత్‌డ్రా చేసుకుంటానని చెప్పాడు. అలాగైతే 20 శాతం సర్వీస్ టాక్స్ చెల్లించాలని, విత్‌డ్రా చేసుకునే మొత్తం రూ.1.27 కోట్లలో 30 శాతం డిపాజిట్ చేయాలని చెప్పడంతో కంగుతిన్నాడు. బాధితుడు గత నెల 4న సైబర్‌క్రైమ్ విభాగానికి, 13న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి సాంబర్ ప్రశాంత్‌కుమార్ గ్రాజ్‌వెల్స్ యాప్‌లో రూ.99,200 పెట్టుబడి పెట్టాడు. నగదు ట్రాన్స్‌ఫర్ అయిన వెంటనే యాప్, వారి వాట్సాప్ నంబర్ పనిచేయలేదు. మోసపోయానని గ్రహించిన బాధితుడు శనివారం సీసీసీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు ఎస్సై నెల్కి సుగుణాక్ తెలిపారు. సైబర్ మోసాలకు గురైన వ్యక్తులు వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930ను సంప్రదిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు.

జలదృశ్యం ఆవిష్కృతం

- ప్రాజెక్టులకు తగ్గని వరద
- శ్రీశైలానికి 4,24,466 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- సాగర్‌కు 4,94,513 క్యూసెక్కుల వరద

శ్రీశైలం ప్రాజెక్టు పది గేట్ల నుంచి పరవళ్లు తొక్కుతున్న కృష్ణానది

గద్వాల/అయిజ/శ్రీశైలం/మహదేవపూర్, ఆగస్టు 3 : ఎగువ నుంచి ప్రాజెక్టులకు వరద వస్తుండటంతో గేట్లను తెరిచి దిగువకు విడుదల చేస్తుండటంతో జలదృశ్యం ఆవిష్కృతమవుతున్నది. శనివారం జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 2.90 లక్షల క్యూసెక్కులు వస్తుండగా.. 37 గేట్ల ద్వారా 2,70,452 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 4,24,466 క్యూసెక్కులు వస్తుండగా.. పది గేట్లను 20 అడుగుల మేర తెరిచి 4,61,560 క్యూసెక్కులు, కుడి, ఎడమ విద్యుదుత్పత్తి కేంద్రాలకు 61,761 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం డ్యాం గేట్లు ఐదు రోజులుగా తెరుచుకొని ఉండటంతో జలదృశ్యాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు భారీగా తరలి వస్తున్నారు. దీంతో శనివారం ఘాట్‌రోడ్ మొత్తం ట్రాఫిక్ జామ్ అయ్యింది. నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో 4,94,513 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 37,180 క్యూసెక్కులు నమోదైంది. ఎస్సారెస్పీకి 17,925 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 703 క్యూసెక్కులు ఉన్నది.

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని నంది పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్‌ల ద్వారా ఎగిసి పడుతున్న గోదావరి జలాలు

కాళేశ్వరం లింక్-2లో కొనసాగుతున్న ఎత్తిపోతలు

ధర్మారం/రామడుగు/బోయినపల్లి, ఆగస్టు 3 : ఎల్లంపల్లి ప్రాజెక్ట్ లింక్-2లోని పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలోని నంది పంప్‌హౌస్‌కు చేరిన నీటిని ఎత్తిపోస్తుండగా, శనివారం 4 మోటర్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. ఈ రిజర్వాయర్ 10 గేట్లను ఎత్తడంతో గ్రావిటీ కాల్వ ద్వారా జంట సొరంగాలకు చేరి అక్కడి నుంచి 7, 8 ప్యాకేజీలోని కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌస్‌కు తరలిపోతున్నాయి. అక్కడి మోటర్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసి శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి తరలిస్తున్నారు. కాగా, శనివారం వరకు ఎస్సారార్ జలాశయంలో 14.062 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.

నిబంధనల ప్రకారమే నర్సింగ్ అధికారుల బదిలీలు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ): ఇటీవల జరిగిన గ్రేడ్-2 నర్సింగ్ ఆఫీసర్ల బదిలీల ప్రక్రియ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే జరిగిందని, ఎక్కడ ఎలాంటి అవకతవకలు జరగలేదని పబ్లిక్ హెల్, ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ వివరించారు. నర్సింగ్ అధికారుల బదిలీలపై ఈ నెల 2న నమస్తే తెలంగాణలో ప్రచురితమైన 'రాత్రికి రాత్రే నర్సుల బదిలీలో మార్పులు' అనే శీర్షికపై డీహెచ్ కార్యాలయం వివరణ ఇచ్చింది. జీఓ.ఎంఎస్.నం.80, పారా 6(డి), ప్రకారమే గ్రేడ్-2 నర్సింగ్ అధికారులను బదిలీ చేసినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే నర్సింగ్ అధికారుల బదిలీల ప్రక్రియ జరిగిందని స్పష్టం చేశారు.

ఎంపీ, ఎమ్మెల్యే మధ్య ప్రోటోకాల్ రగడ

- డీకే అరుణ, వాకిటి శ్రీహరి మాటల యుద్ధం
- నర్వ సింగిల్‌విండో గదుల ప్రారంభంలో రభస

ఊట్కూర్ (నర్వ), ఆగస్టు 3: నారాయణ పేట జిల్లా మక్తల్ నియోజకవర్గం నర్వ మండల కేంద్రంలో సింగిల్‌విండో షాపింగ్ గదుల ప్రారంభోత్సవంలో ప్రోటోకాల్‌పై వివాదం రేగింది. ఈ సందర్భంగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ మధ్య మాటల యుద్ధం కొనసాగింది. సింగిల్‌విండో నిధులు రూ.8 లక్షలతో నూతనంగా నిర్మించిన షాపింగ్ క్లాంప్లెక్స్ ప్రారంభానికి శనివారం ఎమ్మెల్యే, ఎంపీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అంతకుముందు సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతుండగా.. మాజీ విండో చైర్మన్, ప్రస్తుత డైరెక్టర్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డితోపాటు పలువురు బీజేపీ నాయకులు కలుగజేసుకుని ప్రారంభోత్సవ శిలాఫలకంపై ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి పేరు లేదని.. కాంగ్రెస్ మండలాధ్యక్షుడి పేరును వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. శిలాఫలకంపై తమ పార్టీ ఎమ్మెల్సీ పేరును ప్రచురించకపోవడంతో ఎంపీ డీకే అరుణ తీవ్రంగా ఆక్షేపించారు. శిలాఫలకం మార్చాలని పట్టుబట్టారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకున్నది. ఎమ్మెల్యే, ఎంపీ కలుగజేసుకొని పార్టీ నేతలను సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా నర్వ మండలాన్ని అభివృద్ధి చేస్తామని.. అందరూ కలిసిరావాలని కోరారు. తమతో కలిసి వస్తే కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేసుకుందామని ఎంపీ అరుణ పేర్కొన్నారు.

స్కూళ్లకు ఉచిత విద్యుత్తు ఉత్త బోగస్

- సౌరవిద్యుత్తుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి
- రెడ్‌కో మాజీ చైర్మన్ సతీశ్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యు త్ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన ఉత్త బోగస్ అని, సోలార్ విద్యుత్తుకు ప్రభు త్వం నిధులు విడుదల చేయాలని రెడ్‌కో మాజీ చైర్మన్ వై సతీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని స్కూళ్లకు 'మన ఊరు-మన బడి'లో భాగంగా సోలార్ విద్యుత్తు అందించాలని నిర్ణయించిందని తెలిపారు. మొదటి విడత 11 జిల్లాల్లో 1,521 బడుల్లో సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. రెండో విడతలో మరో 5,267 స్కూళ్లల్లో సోలార్ విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుందని, అందుకు రూ.283 కోట్ల ఖర్చు అవుతుందని ప్రతిపాదనలు కూడా సిద్ధం చేసిందని పేర్కొన్నారు. ఆ ప్రతిపాదిత మొత్తాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో నకిలీ నోట్ల ముఠాసభ్యుల అరెస్టును చూపుతున్న పోలీసులు

నకిలీ నోట్ల ముఠా గుట్టురట్టు

ఆరుగురి అరెస్ట్.. రూ.500 నకిలీ నోట్ల స్వాధీనం

మెట్‌పల్లి, ఆగస్టు 3: ఆరుగురు సభ్యుల నకిలీ నోట్ల ముఠాను పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పోలీస్ సబ్ డివిజనల్ అధికారి కార్యాలయంలో శనివారం డీఎస్పీఉమామహేశ్వర్‌రావు ముఠా సభ్యుల అరెస్టును చూపి వివరాలు వెల్లడించారు. ఈజీ మనీ కోసం జగిత్యాల జిల్లాకు చెందిన సదాల సంజీవ్, బిట్టు శివకుమార్, నిర్మల్ జిల్లాకు చెందిన మగ్గిడి కిషన్, కలకుంట్ల గంగారాం, బొంగురాల మల్లయ్య ఉరఫ్ పులి, మునిమానికల అశోక్ కలిసి ముఠాగా ఏర్పడ్డారు. నకిలీ నోట్లు ఇచ్చి అసలు నోట్లు తీసుకోవాలని,లక్ష అసలుకు రూ.5 లక్షలు నకిలీవి చెలామణి చేయాలని నిర్ణయించుకున్నారు. హైదరాబాద్‌లో ముగ్గురిని, ధర్మపురిలో ఒకరిని, కరీంనగర్‌లో ఒకరిని, జన్నారంలో ఒకరిని, జగిత్యాలలో ఒకరిని నమ్మించి అసలు డబ్బులు రూ.10 లక్షల వరకు పోగేశారు. ఈ నెల 1న రాత్రి జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం చౌలమద్ది శివారులోని పెద్దగుండు సమీపంలో దాబా యజమాని రాజేందర్‌కు రూ.5 లక్షలు ఇస్తామని చెప్పి అసలు రూ.లక్ష లాక్కొని పారిపోయారు. ఈ నెల 2న బాధితుడి ఫిర్యాదుతో మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. స్థానిక సీఐ నిరంజన్ రెడ్డి నేతృత్వంలో ఎస్సైలు చిరంజీవి, రాజు, పోలీస్ సిబ్బంది.. మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని వీరేంద్ర దాబాలో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నా రు. వారి నుంచి నకిలీ నోట్లు రూ.7 లక్షలు, కారు, బైక్, సెల్‌ఫోన్లను, రూ.5,050 అసలు నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ తెలిపారు.